క్లుప్తంగా

శ్రీశ్రీ రచనలు అజరామరం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ కవి శ్రీశ్రీ జయంతిని స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తెనాలి ప్రాంత అధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. 'సహజకవి' అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ శ్రీశ్రీ జీవిత విశేషాలను వివరించారు. శ్రీశ్రీ కవితలను వినిపించారు. శ్రీశ్రీ రాసిన పాటలను గాయకుడు విజయసారథి వివరించారు. ఆర్టీసీ సాంస్కృతిక విభాగం కన్వీనర్ ప్రేమ్‌కుమార్ తన ప్రసంగంలో శ్రీశ్రీ విప్లవ పంథాను వివరించారు. జాతీయ హరికథా భాగవతారిణి, ఇస్కఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బెజ్జంకి నాగమణి మాట్లాడుతూ శ్రీశ్రీ ఒక క్రాంతిదర్శిగా పేర్కొన్నారు. అనంతరం శ్రీశ్రీ రచించిన వివిధ గేయాలను గానం చేశారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతులతో వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి మాధవస్వామి బృందం వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు విజయబాబు, అచ్యుతరామయ్య, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

కార్మికుల పని వేళలు మార్చాలి

లక్ష్మీపురం: జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు అధికంగా ఉన్నందున పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని కార్మిక శాఖ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. రోజువారి భవన నిర్మాణ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల రక్షణకు, ఇటుకల బట్టీలు, దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల యజమానులకు పలు మార్గదర్శకాలు, సూచనలు చేశారు. కార్మికులపై ఎండ తీవ్రత ప్రతికూల ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యంపై ఉందని చెప్పారు. కష్టమైన పనులు చేసే కార్మికుల పని వేళలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్పు చేసి పనికి దూరంగా ఉంచాలన్నారు. పని ప్రదేశంలో నీడ ఉండేలాగా, ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో వారు పనిచేసేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో అవసరాల మేరకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు అత్యవసర ఐస్ ప్యాక్స్ అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కార్మిక శాఖ కమిషనర్ జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ప్రతి ఒక్క యజమాని పాటించాలన్నారు. కార్మికులకు ఉపశమనం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని వెల్లడించారు.

శ్రామిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

తాడేపల్లిరూరల్ : శ్రామిక దినోత్సవం మే 1న ఘనంగా జరుపుకోవాలని మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ ఓనర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట యూనియన్ ఆఫీస్‌లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య తీసుకు వచ్చిన మేడే కరపత్రాన్ని నాయకులు, డ్రైవర్స్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి. కొండారెడ్డి మాట్లాడుతూ 138 ఏళ్ల క్రితం శ్రమ దోపిడీపై శ్రామికవర్గం తిరుగబాటుతో మే డేకు అంకురార్పణ జరిగిందని తెలిపారు. 1886లో చికాగో నగరంలో హే మార్కెట్ వద్ద లక్షలాది మంది కార్మికులు 8 గంటల పని విధానం కోసం ఆందోళన మొదలు పెట్టారని, మే 3న 3 లక్షల మంది కార్మికులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసిన క్రమంలో పోలీసులు కాల్పులు జరిపారని, ఈ కాల్పులలో వందలాది మంది కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్మిక వర్గ పోరును రక్తాక్షరాలతో లిఖించిన రోజుకు గుర్తుగా మే 1న మేడే పోరాట దినంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎస్కే శ్రీను, యూనియన్ నాయకులు సైదా, జి. నివాసరావు, బి.వరప్రసాద్, బి.కృష్ణ, ఏడుకొండలు, రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం



దావులూరిపాలెం రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న శివకుమార్



తూములూరు యాదవపాలెంలో శివకుమార్‌కు హారతి ఇస్తున్న మహిళలు

- ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్
- దావులూరిపాలెం, తూములూరు, చివలూరు, శిరిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో లోకల్ శివన్నకు హారతులు పట్టిన మహిళలు

తూములూరు(కొల్లిపర): ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని.. నిత్యం అందుబాటులో ఉండే తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ కోరారు. మండలంలోని దావులూరిపాలెం, తూములూరు, చివలూరు, శిరిపురం గ్రామాల్లో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. రోడ్ షో నిర్వహించారు.

రోడ్ షోలో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పథకాలు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితులు పోయాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయిలోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల ముంగిటకు పాలన చేర్చిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలను మార్చడంతో పాటు విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి పేదలకు ఉన్నత విద్య చేరువ చేసిన జగనన్నకు ఈ ఎన్నికల్లో అంతా మద్దతుగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో 600కు పైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు పొత్తులతో ఓట్లు అడగడానికి వస్తున్న వారికి బుద్ధి చెప్పాలన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లల్లో తూములూరు గ్రామ సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.52 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, సచివాలయం నిర్మాణాలకు రూ.3 కోట్లు ఖర్చు చేసినట్లు, ఇవి కాకుండా రూ.38 లక్షలతో ఇంటర్ మహిళా కళాశాల నిర్మించి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇంత అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి ప్రతి ఓటరు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను..ఎంపీగా కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అవుతు శేకరరెడ్డి, సర్పంచ్‌లు బాణావత్ అరుణాబాయ్, బొంతు వేణుగోపాలరెడ్డి, పచ్చవ సులోచనరాణి, ఎంపీటీసీలు అద్దంకి బోసుబాబు, అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, కారుమంచి పృథ్వీకుమార్, పార్టీ నాయకులు ఏమినేని శేషగిరి, ఏమినేని నాంచారమ్మ, కాటూరి శివకుమారి, కాటూరి సాంబశివరావు, కాటూరి మల్లేశ్వరరావు, ఈమని హరికోటిరెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, బేతాల భూషణం, మోర్ల శ్రీను, ఈమని హర్షవర్ధన్ రెడ్డి, ఆరుమళ్ల శివారెడ్డి, బాదం సురేష్, పచ్చవ రమేష్, హరికోటిరెడ్డి యూత్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం..

ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్(లోకల్ శివన్న)కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తూములూరు, దావులూరిపాలెం, చివలూరు, శిరిపురం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి శివకుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. పార్టీ శ్రేణులు శివకుమార్‌ని పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. అడుగడుగునా మహిళలు పూలు జల్లి, హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



అధికారులపై ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ కోటేశ్వరరావు

- మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక
- అధికారులు శాఖాపరమైన సమస్యలపై వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించాల్సిందే
- ముగిసిన కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిరూరల్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మంగళవారం ఉదయం సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశం ప్రశాంతంగా జరిగింది. అజెండాలో పొందు పరిచిన మూడు అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశం జరుగుతున్న సమయంలో 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు లేచి తమ వార్డులో లైట్ల సమస్య గురించి మాట్లాడారు. మున్సిపల్ ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆయన ఫిర్యాదు చేశారు. అసలు ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయరంటూ ప్రశ్నించారు. దీనిపై ఏఈ సమాధానం ఇచ్చే ప్రయత్నం చేసినా ఆయన శాంతించ లేదు. వార్డులో సమస్య గురించి మాట్లాడేందుకు కౌన్సిలర్‌గా తాను ఫోన్ చేస్తే ఎందుకు స్పందించలేదని అన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న లేచి మాట్లాడారు. ఫోన్‌లో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. పలువురు కౌన్సిలర్లు వివిధ సమస్యల గురించి కౌన్సిల్‌లో మాట్లాడారు. కౌన్సిల్ సమావేశంలో అన్ని అంశాలు ఆమోదించడం జరిగిందని చైర్‌పర్సన్ రాధిక తెలిపారు. అనంతరం అత్యవసర సమావేశం అజెండాలోని అంశాన్ని ఆమోదించారు.



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

పశు వైద్యుడికి సత్కారం

తెనాలిరూరల్: ప్రపంచ పశు వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన సత్యం శివం సుందరం సమాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో వైద్యుల సత్కార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పట్టణ నాజరుపేటలోని పశు వైద్యశాలలో ఐదేళ్లుగా వైద్యుడిగా విశేష సేవలందిస్తున్న డాక్టర్ బొంతు నాగిరెడ్డిని సత్కరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ వేలాదిగా పశువులకు అమూల్యమైన వైద్యసేవలు అందిస్తూ పశుపోషకుల ప్రియనేస్తంలా మసలుతున్న డాక్టర్ నాగిరెడ్డి ఆదర్శనీయులని కొనియాడారు. సామాజిక కేంద్ర వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్, పొట్టి నరేంద్ర, మాలేపాటి హేమ్ కుమార్, షేక్ షఫీ, లయన్ శంకర్, పేటేటి రవికుమార్, మాజీ కౌన్సిలర్ దంతాల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగిరెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి



ప్రచారంలో వైఎస్సార్ సీపీ కరపత్రాన్ని అందజేస్తున్న పుష్ప, రాధిక

తెనాలిరూరల్: అందరికీ మంచి చేసే వైఎస్సార్ సీపీని ప్రజలంతా ఆదరించాలని తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. పట్టణ తొమ్మిదో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికతో కలసి ఆమె మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ 27 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రూ.1800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట వార్డు కౌన్సిలర్ వీరిశెట్టి శివనాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు వీరిశెట్టి భాస్కర్, కఠారి హరీష్, చుండూరు వెంకటేశ్వరరావు, చొక్కా ఆనందం, చింకా సురేష్ యాదవ్, మల్లెబోయిన కొండ యాదవ్, తట్టుకుళ్ళ అశోక్ యాదవ్, 9వ వార్డు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెనాలిరూరల్: వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనతోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి అన్నారు. రూరల్ మండల గ్రామం గుడివాడలో మంగళవారం సాయంత్రం ఆయన పార్టీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారికి గత ఐదేళ్లలో అందించిన పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో దేశంలో పలు రాష్ట్రాలు ఆర్థిక భారంతో సతమతం అయినప్పటికీ ఏపీలో మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగే విధంగా చర్యలు చేపట్టారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా పాలనను అందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, బురదగుంట రమేష్, కడియాల శివరామబ్రహ్మం, కంచర్ల మరియమ్మ, బుంగ లలితకుమారి, కొలకలూరు బుచ్చయ్య, బురదగుంట చినదావీదు, పాలపర్తి చైతన్య, బురదగుంట బోసు, రుద్రపాటి నాగేంద్రం, బుంగ నరేష్, అలీనగర్ బాషా తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవం తాకట్టు సిగ్గుచేటు

నెహ్రూ నగర్: మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ టీడీపీకి తాకట్టు పెట్టడం సిగ్గుచేటని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మాదిగలను అన్ని రకాల ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబుకు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు కూటమికి ఓట్లు వేస్తే మాదిగలు మరింత వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విజ్ఞత కలిగిన మాదిగలు ఓటుతో టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన

గుంటూరు మెడికల్: షాహిన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో వరంగల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్, యువ నారి హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి కోర్సులు ఎంచుకుంటే భవిష్యత్‌లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లభిస్తాయో అనే అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ భావి భారత భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు నేటి విద్యార్థులే అన్నారు. విద్యార్థులు వారు ఎంచుకునే కోర్సులు పైనే వారి భవిష్యత్ ఉంటుందన్నారు. ఏ కోర్సు చేస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయో తదితర విషయాల గురించి ఈనెల 15వ తేదీ నుంచి హోప్ విన్ హాస్పిటల్స్, యువ నారి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్ స్టాగామ్ అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి



ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో సమావేశమైన పశ్చిమ ఆర్‌ఓ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కె.రాజ్యలక్ష్మి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులతో తమ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ పూర్తైన నాటికి పోటీలో 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, వీరందరు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎలక్షన్ కమిషన్ 21 టీంలను ఏర్పాటు చేయుట జరిగిందని, ఎన్నికల ప్రచారానికి సంబంధించి అభ్యర్థుల ప్రతి కదలికను పర్యవేక్షించడం జరుగుతుందని వివరించారు. అభ్యర్థులు ప్రచార ఖర్చులను ఎన్నికల కమిషన్ అందించిన పుస్తకాల్లో క్రమపద్ధతిలో నమోదు చేయాలని సూచించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల ర్యాండమైజేషన్(ఏ పోలింగ్ బూత్‌కి ఏ ఈవీఎం పంపాలి) నగర పాలక సంస్థలోని ఆర్‌ఓ చాంబర్‌లో చేపట్టినట్లు తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. హోం ఓటింగ్ తేదీలను త్వరలోనే అభ్యర్థులకు తెలియచేయుట జరుగుతుందని, అభ్యర్థులు, ఏజెంట్లు హోం ఓటింగ్ ప్రక్రియలో నిబంధనల మేరకు పరిశీలించవచ్చని, అంతేకాని హోం ఓటింగ్ ప్రాంతంలో ఓటర్లను ప్రభావితం, ప్రచారం చేయకూడదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు ఫెసిలిటేషన్ సెంటర్లను త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కూడా అభ్యర్థులు పర్యవేక్షించవచ్చునన్నారు. మే 3,4 తేదీల్లో ఈవీఎంల కమిషనింగ్ జరుగుతుందని అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో గతం కంటే ఓటింగ్ శాతం పెంచుటకు అభ్యర్థులు ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓ సి.హెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పద్మ పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మంగళగిరి నియోజకవర్గ కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజకుమారి పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ వద్ద చేపట్టనున్న ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. పోలింగ్ ముగించుకుని వచ్చే వాహనాలకు విశ్వవిద్యాలయ పరిధిలో ఎటువంటి ట్రాఫిక్ సమస్య కలుగకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి రాజకుమారి తన కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వైలయన్స్ టీమ్స్ లైవ్ స్ట్రీమింగ్‌లు పరిశీలించారు.

జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజి వార్డు

- మే నుంచి నిరంతర సర్జికల్ గ్యాస్ట్రో సేవలు
- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



వైద్య అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును కేటాయించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలోని పలు విభాగాధిపతులతో సూపరింటెండెంట్ చాంబర్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వార్డు, ఆపరేషన్ థియేటర్, సిబ్బంది కేటాయింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పొదిల ప్రసాద్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ఒక వైద్యుడుతో పాటు, సహాయకులను కూడా నియమిస్తున్నామని చెప్పారు. మే నుంచి నిరంతరంగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటి వెంకటేశ్వర్లు, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని పాల్గొన్నారు.

షిరిడిలో మెరిసిన తెలుగు తేజాలు



వేదికపై బృందంతో నాట్య గురువు అనుశేఖర్, తల్లిదండ్రులు

గుంటూరు ఎడ్యుకేషన్: షిరిడిలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య ప్రదర్శనల్లో తెలుగుతేజాలు మెరిశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నృత్యకారిణులతో పోటీపడి, గుంటూరు కళా ప్రతిభ చాటారు. ఈనెల 27, 28వ తేదీల్లో షిరిడిలో సాయి నృత్యోత్సవ్–2024 పోటీలను నిర్వహించింది. శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ అధికారికంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీలకు షిరిడిలోని సాయి శతాబ్ది మండపం వేదికగా నిలిచింది. పోటీల్లో పాల్గొన్న గుంటూరు శ్రీనగర్ ఏడోలైనుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం అక్కడ అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలో 12 మంది నృత్యకారిణులు అత్యంత క్లిష్టమైన ''కళింగనర్తన'' (కాళీయమర్ధన) ప్రదర్శనతో షిరిడిలోని తెలుగువారితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు, విదేశీ పర్యాటకులను ఆకర్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన నృత్య కారిణులు బృందం వారి నాట్య గురువు అనుశేఖర్ సారథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడతో పాటు గుంటూరు జిల్లాలోని పెదకాకాని, తదితర దేవాలయాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

పింఛన్ల కోసం సచివాలయాలకు రావద్దు

- 75 శాతం మందికి బ్యాంకు ఖాతాల్లోనే జమ
- మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి: మే నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందని పింఛను కోసం ఎవరూ సచివాలయాలకు రానవసరం లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం తన ఛాంబరులో మీడియా ముఖంగా ప్రజలకు తెలియజేశారు. సామాజిక పింఛన్లను ఆధార్‌తో ఫోన్ నెంబరు లింకైన 75 శాతం బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని, మిగిలిన పింఛను మొత్తాలను సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి అందజేస్తారని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పింఛన్ల పంపిణీలో కొన్ని మార్పులు జరిగాయని చెప్పారు. పట్టణంలో మొత్తం 16 వేల మంది వివిధ రకాల పింఛనుదార్లు ఉన్నారని గుర్తుచేశారు. వీరిలో 12 వేల మందికి పింఛను మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మిగిలిన వృద్ధులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి అందజేస్తారని వివరించారు.

ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొంటే చర్యలు

నెహ్రూ నగర్: ప్రభుత్వ ఉద్యోగులు, ఆప్కాస్ ఉద్యోగులు ఎవరైనా రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొన్నా, ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ల అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఏ విధమైన రాజకీయ పార్టీల సభల్లోను, ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొనకూడదన్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరులో టీడీపీ ఏర్పాటు చేసిన రాజకీయ కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా రాజకీయ నాయకులకు బొకేలు ఇచ్చి, ఫొటోలు దిగిన నగర పాలక సంస్థ 192వ వార్డ్ సచివాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ళ అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన చేసే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

భూషణానికి డాక్టరేట్ ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బయోటెక్నాలజీ పరిశోధకుడు కసుకుర్తి భూషణానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. బయోటెక్నాలజీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ పి.సుధాకర్ పర్యవేక్షణలో 'ఎలక్ట్రోమాగ్నటిక్ ఫీల్డ్ రేడియేషన్ ఇంపాక్ట్ ఆన్ లోకల్ అండ్ సిస్టమాటిక్ టిష్యూస్ విత్ ఐ రెటీనా అండ్ ఆప్టిక్ నెర్వ్స్ ఇన్ రేట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను భూషణానికి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.